




స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీగిరిపై లక్ష దీపోత్సవం

ఘనంగా పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరణికి దశవిధ హారతులు కార్యక్రమాలను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. చివరి సోమవారం కావడంతో క్షేత్ర వీధుల్లో భక్తుల రద్దీ కనిపించింది. వేకుజాము నుంచే పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మంటపం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశ దీపం వెలిగించారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు మంచినీళ్ళు, అల్పాహారం ఏర్పాటు చేశారు.



పాతాళగంగలో స్నానమాచరిస్తున్న భక్తులు



పుష్కరిణికి హారతి ఇస్తున్న అర్చకుడు

సామూహిక కేదార గౌరీ వ్రతం

- చెంచులకు ప్రత్యేక ఆహ్వానం
- వ్రతంలో పాల్గొన్న 1300 మంది భక్తులు

శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానం సామూహిక కేదారగౌరీ వ్రతాలు నిర్వహించింది. అక్కమహాదేవి అలంకార మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చెంచులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. భక్తులచే గణపతి పూజ, కలశస్థాపన, వ్రతకల్పం అయ్యాక వ్రతం చేయించారు. 376 మంది చెంచులు, 960 మంది ఇతర భక్తులు పాల్గొన్నారు. స్థానిక చెంచులతో పాటు నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, కొత్తపల్లి, బండి ఆత్మకూరు, ఆళ్ళగడ్డ, పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, ప్రకాశం జిల్లాలోని దోర్నాల, చింతల, తదితర ప్రాతాల నుంచి చెంచు భక్తులు వచ్చి ఈ వ్రతంలో పాల్గొన్నారు.



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా లక్ష దీపోత్సవం

పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలకరించి పుష్కరణి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అట్లాగే పుష్కరిణికి వేదమంత్రోచ్చరణ నడుమ దశవిధ హారతులను నివేదించారు. ఒక్కో హారతిని దర్శించుకోవడం వల్ల కలిగే పుణ్యఫలితాలను వివరిస్తూ దశవిధ హారతులను సమర్పించారు.



మద్యంలో ముడుపుల వేట..!

- నెలకు రూ.2 లక్షలు కప్పం కట్టాల్సిందే
- వ్యాపారం సక్రమంగా సాగాలంటే చెప్పినట్లు వినాల్సిందే
- మద్యం దుకాణం యజమానులపై ఒత్తిళ్లు
- అధికార పార్టీ కోటరీ సభ్యుడి కనుసన్నల్లో తతంగం
- మధ్యవర్తులుగా ఎక్సైజ్ శాఖ అధికారులు?
- డోన్ నియోజకవర్గంలో 'స్పెషల్ మద్యం పాలసీ'

నంద్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): '

'గత ప్రభుత్వం మద్యం పేరిట దోపిడీ చేసింది. హోల్‌సేల్, రిటైల్ తయారీ వ్యవస్థలను అస్తవ్యస్తం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పారదర్శకత తీసుకువచ్చింది. బెల్టు షాపులు పెడితే ఖబడ్దార్, బెల్టు తీస్తాం.. ఎమ్మెల్యేలు బెల్టు షాపులు లేకుండా చూసుకోవాలి'... ఇది మొన్నటి వరకు అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు నాయుడు బెల్టు షాపులపై వైఖరిని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో పెనుమార్పులు తీసుకొచ్చింది. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నాణ్యమైన మద్యాన్ని అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టింది. కానీ కొన్నిచోట్ల మాత్రం ప్రభుత్వ మద్యం పాలసీకి భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో మద్యం పాలసీ పాటించినా, పాటించకపోయినా పర్వాలేదు తమకు మాత్రం నెలకు రూ.2 లక్షలు కప్పం చెల్లించాలంటూ ఇక్కడి అధికార పార్టీలోని ముఖ్యనాయకుడి కోటరీ సభ్యుడు బేరసారాలకు తెరతీశాడు. ఈ మద్యం వ్యాపారంలో మధ్యవర్తిత్వం వహించేందుకు ఏకంగా అబ్కారీశాఖ అధికారులనే రంగంలోకి దింపుతున్నట్లు సమాచారం. ఇటు నాయకులు, అటు అధికారులు కుమ్మక్కై డోన్ నియోజకవర్గవ్యాప్తంగా 'స్పెషల్ మద్యం పాలసీ'ని అమలు చేస్తున్నారంటూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

16 మద్యం దుకాణాలు.. రూ.32 లక్షలు?



డోన్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం

గత ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తంగా తయారు చేయటంతో కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. కొత్తగా మద్యం పాలసీని తీసుకువచ్చి జిల్లాల వారీగా మద్యం దుకాణాలను కేటాయించింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గానికి 16 మద్యం దుకాణాలను కేటాయించింది. వీటిని జిల్లాలోని మిగతా షాపుల మాదిరిగానే లాటరీ విధానంలో ప్రైవేటు వ్యాపారులు దక్కించుకున్నారు. మద్యం దుకాణాల ద్వారా మాత్రమే సరుకును అమ్ముకుంటే పెద్దగా లాభం ఉండదని ఆయా దుకాణాల యజమానులు ఆలోచనలో పడ్డారు. ఇదే అదునుగా భావించిన నియోజకవర్గ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఆయా దుకాణాల్లో నాణ్యతలేని సరుకును అమ్ముకున్నా, ఇతర రాష్ట్ర సరుకును అమ్ముకున్నా చూసి చూడనట్లు వదిలేసి తద్వారా డబ్బులు దండుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఇందుకోసం ఒక్కో మద్యం దుకాణం నెలకు రూ.2 లక్షలు తమకు ముట్టజెప్పాలని హుకుం జారీ చేశారు. ఈ అక్రమ తతంగంలో సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు చెప్పినట్లుగా ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.2 లక్షలు, మొత్తం రూ.32 లక్షలు వసూలు చేసేందుకు డోన్ ఎక్సైజ్ శాఖకు చెందిన సీఐ స్థాయి అధికారి రంగంలోకి దిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా 6లో..

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ఇంకా పెండింగ్‌లో ఉన్న 774 ఫిర్యాదులను బియాండ్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలన్నారు. వచ్చే వారం ముఖ్యమంత్రితో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉండే అవకాశం ఉందని, ఈలోగా ఫిర్యాదులన్నీ క్లియర్ కావాలని జేసీ తెలిపారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, సివిల్‌సప్లై, పోలీస్ తదితర శాఖలలో అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని, ఆర్డీఓలు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలన్నారు. సీఎంఓ కార్యాలయపు ఫిర్యాదులు కూడా 67 పెండింగ్‌లో ఉన్నాయని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏపీ సేవా సర్వీసులపై సంబంధిత అధికారులు క్లియర్ చేయాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రీసర్వేకి సంబంధించి సూచించిన నాలుగు ప్రొఫార్మాల్లో వివరాలు పొందుపరిచి మంగళవారం సాయంత్రంలోగా అందజేయాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో 124 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తాగునీరందించండి: పాణ్యం 5వ వార్డులో తాగునీరు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. తాగునీరు అందించి దాహార్తి తీర్చాలని తహసీల్దారు నరేంద్ర నాథరెడ్డిని కోరారు. కార్యక్రమంలో షేక్ నూర్జహాన్, గౌసియాబేగం, రజియా బేగం, పాల్గొన్నారు.

నా నిజాయితీపై బాబుకు నమ్మకం

- ఎమ్మెల్యేలందరూ నన్ను ఆశీర్వదించాలి
- ప్రమాణ స్వీకారోత్సవంలో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తన నిజాయితీపై చంద్రబాబుకు నమ్మకం ఉన్నందున మరోసారి కుడా చైర్మన్ బాధ్యతలు అప్పగించారని సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని ఎంఆర్సీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబును తాను అన్నా అని సంబోధిస్తానని, పార్టీకి స్థాపించినప్పటి నుండి అధికార, ప్రతిపక్షాల్లో ఎక్కడ ఉన్నా రాష్ట్ర స్థాయిలో తాను ఎన్నో కార్యక్రమాలు చేపట్టి నిజాయితీగా సేవలు అందించానని అన్నారు. తాను ఊహించని తీరులో పార్టీ మరోసారి తనకు సేవలందించే అవకాశం కల్పించడం గర్వంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలంతా తనను కుడా చైర్మన్‌గా ఆశీర్వదించాలని కోరారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులకు అవకాశం కల్పించిందని, అందులో నీతిమంతుడైన ఎన్ఎండీ ఫరూక్‌కు న్యాయశాఖ కేటాయించారని, అలాగే టీజీ భరత్‌కు పరిశ్రమల శాఖ ఇచ్చి తగిన ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర ద్వారా పార్టీలో వర్గాలు, లోపాలు, కుమ్ములాటలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశారని, తనకు పదవి రావడం దాని కారణమే అని అన్నారు.

మిగతా 7లో

అంధులకు వెలుగునిచ్చిన నేత్రదానం



శంకరయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానం సర్టిఫికెట్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ యోగా నిత్య సాధకుడు బొంతల శంకరయ్య ఆదివారం మరణించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీకి ఫోన్ చేసి తన తండ్రి నేత్రాలను దానం చేస్తామని తెలిపారు. వెంటనే ఆనంద్‌గురూజీ రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరికి తెలిపారు. కర్నూలు నుండి టెక్నీషియన్లు వచ్చి రెండు నేత్రాలను సేకరించి హైదరాబాదు ఎల్వీ ప్రసాద్ నేత్రశాలకు పంపించారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బొంతల శంకరయ్యను, ఆయన కుమారుడ్ని ఆదర్శంగా తీసుకుంటే ఎందరో అంధులకు చూపు వస్తుందని అన్నారు.

మహానందిలో శివ నామస్మరణ

- చివరి సోమవారం భక్తుల రద్దీ
- వైభవంగా జల హారతి





దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, జలహారతి ఇస్తున్న అర్చకులు

మహానంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగింది. వేకువ జాముననే భక్తులు ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో కార్తీక పుణ్య స్నానాలను ఆచరించారు. క్యూలో రెండు గంటల పాటు నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలో పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. రాత్రి రెండో ప్రాకారంలోని కోనేరు వద్ద గంగాదేవికి జలహారతిని ఇచ్చారు.




ఆధ్యాత్మికం



ఆహ్లాదం ముచ్చట్ల ఆలయం

- ఇక్కడికి వస్తే శ్రీశైలానికి వెళ్లినట్లేనని నమ్మకం
- అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్

బేతంచెర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొండల నడుమ వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం పురాతన కాలం నాటిదని, భక్తులు శ్రీశైలానికి వెళ్లిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లినా ఒకటేనని భక్తుల ప్రగాఢ నమ్మకం. బేతంచెర్ల మండలం హెచ్ కొట్టాల గ్రామ సమీపంలోని కొండల మధ్య ఈ ఆలయం ఉంది. ముక్కోటి దేవతలు ముచ్చట్లాడి ప్రతిష్ఠించిన శివలింగమే ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అని పురాణ కథలు చెబుతున్నాయి. అయితే పురావస్తు శాఖ అధికారులు గానీ, దేవదాయ శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ఏడాది ఆలయ అభివృద్ధికి రూ.1.90 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులకు టెండర్లు పిలిచినా ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కార్తీక మాసం, మాఘ మాసంలో మల్లికార్జున స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. గతంలో ఆలయానికి భక్తులు రావాలంటే హెచ్ కొట్టాల స్టేజీ నుంచి నడిచి వెళ్లేవారు. ప్రస్తుతం దేవాలయానికి వెళ్లడానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ కమ్మ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే మహా శివరాత్రి పండుగ సమయంలో భక్తుల రాకపోకలు, ఆర్యవైశ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఆటోలు ఏర్పాటు చేసి అల్పాహారంతోపాటు భోజన వసతి కల్పిస్తున్నారు. అయితే ఆలయ ప్రాంగణంలో వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఆలయ అభివృద్ధి నిలిచిపోయిందని తెలుపుతున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు వర్షానికి నిలిచిన నీటితోనే స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత దేవదాయ శాఖ ఉన్నతాధికారులు పురాతన శైవ దేవాలయమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.



పురాతన ముచ్చట్ల ఆలయం ఇదే



ముచ్చట్లలోని కోనేరు

కోనేరు ఏర్పాటు చేసి నీరు నింపాలి



మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు స్నానాలు చేసేందుకు కోనేరు ఏర్పాటు చేసి నీటిని నింపాలి. భక్తులకు వసతులు ఏర్పాటు చేసి ఆలయాన్నిఅభివృద్ధి చేయాలి.

-నాగమోహన్
హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యుడు, బేతంచెర్ల



కొండల నడుమ వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం

గాలిగోపురానికి మరమ్మతులు చేపట్టాలి



పురాతన శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయ గాలి గోపురానికి పురావస్తు శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టాలి. భక్తుల రాకపోకలు పెరిగాయి. ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. భక్తులకు అన్ని వసతులు కల్పించాలి.

- యోగేంద్రబాబు,
హెచ్.కొట్టాల

మల్లన్న సన్నిధిలో హోం మంత్రి



ఆలయ ప్రాంగణంలో హోం మంత్రి అనిత

శ్రీశైలం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న హోం మంత్రి అనితకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి అనితకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. దర్శనానంతరం మంత్రి అనిత ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహిస్తున్న లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమంలో పల్గొన్నారు. అంతకముందు భ్రమరాంబిక అతిథిగృహం వద్దకు చేరుకున్న హోంమంత్రి అనితకు ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

శీతల బేస్ క్యాంపు పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీపీటీ

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో సోమవారం నాగార్జున టైగర్ ప్రాజెక్టు ఎఫ్‌డీపీటీ బీవీఏ కృష్ణమూర్తి పర్యటించారు. రెవెన్యూ పరిధిలోని శీతల బేస్‌క్యాంపును తనిఖీ చేసి వైర్‌లెస్ సెట్‌ను, వాకీటాకీలను పరిశీలించారు. రుద్రవరం డివిజన్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాలను, కలప డిపోను, గెస్ట్‌హౌస్ భవనాన్ని పరిశీలించారు. అటవీ సంరక్షణ పట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, బీట్ ఆఫీసర్ నాగహుసేనయ్య పాల్గొన్నారు.

మద్యంలో ముడుపుల వేట..!



డోన్‌లోని మద్యం దుకాణం

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను సెబ్‌లో విలీనం చేయటంతో అక్రమ మద్యం, బెల్టు షాపులపై నియంత్రణ సరిగా లేకుండా పోయింది. దీనిని కట్టడి చేయాలంటే ఎక్సైజ్ శాఖను మళ్లీ ప్రత్యేకంగా ఉంచాలని కూటమి ప్రభుత్వం భావించి, అదే విధంగా చేసింది. ఎక్సైజ్ శాఖను మళ్లీ పాత పద్ధతిలోనికి తీసుకురాగానే సంబంధిత అధికారులు గతంలో మాదిరి ప్రవర్తిస్తూ ఆయా నియోజకవర్గ నాయకులు చెప్పినట్లు వినడం మొదలుపెట్టారన్న విమర్శలున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే డోన్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకుడి అనుచరులు మద్యం దుకాణాల నుంచి రూ.2 లక్షలు వసూలు చేయాలని చెప్పారో లేదో... ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారి అలా పావులు కదపడం మొదలు పెట్టారు. సదరు అధికారి నియోజకవర్గ ముఖ్య నాయకుడికి, మద్యం దుకాణాల యజమానులకే కాకుండా, మద్యం దుకాణం, బెల్టు షాపు యజమానులకు కూడా అనుసంధానకర్తగా ఉంటున్నాడని సమాచారం. మద్యం దుకాణాల ద్వారా ఇతర సరుకును అమ్ముకోవటమే కాకుండా, బెల్టు షాపులను ఏర్పాటు చేసుకోవచ్చంటూ ఉచిత సలహా పడేస్తున్నాడు. ఆయా మద్యం దుకాణాల పరిధిలో బెల్టు షాపుల నుంచి ఎంత వసూలు చేస్తారు? బెల్టు షాపులకు నెలకు ఎంత సరుకు అమ్ముకుంటారు? అనేది సంబంధం లేదు. కానీ నెలకు రూ.2 లక్షలు మాత్రం ముట్టజెప్పాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. తాను చెప్పినట్లు చేయకపోతే మద్యాన్ని అమ్ముకోలేరని, ఆ తర్వాత ఇబ్బందులు పడతారని మద్యం దుకాణ యజమానులను బెదిరించినట్లు సమాచారం. సదరు అధికారి తీవ్ర ఒత్తిడి తీసుకువస్తుండటంతో బెంబేలెత్తిపోయిన మద్యం దుకాణదారులు నెలకు రూ.2 లక్షలంటే తమ వల్ల కాదని, నెలకు రూ.50 వేల చొప్పున 16 దుకాణాల నుంచి రూ.8 లక్షలు ఇచ్చుకోగలమని బేరానికి వచ్చినట్లు సమాచారం. దీనిపైన ఇంకా ప్రతిష్టంబన వీడలేదు.

ఎందుకిలా..?

మద్యం దుకాణాల లాటరీ సమయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సిండికేట్లు నడిచినా, డోన్ నియోజకవర్గంలో సిండికేట్ నడవలేదు. ఇక్కడ దుకాణాలు దాదాపు టీడీపీ వారికే దక్కాయి. ఒకటి రెండు చోట్ల వేరే వారికి దుకాణాలు లాటరీలో తగిలినా, వారు గుడ్‌విల్ ఇచ్చి ఇతరులకు అమ్ముకున్నారు. దీనివల్ల ఇక్కడి ముఖ్యనేతలకు పెద్దగా డబ్బు పరంగా పెద్ద ప్రయోజనం లేకుండా పోయింది. ఆయా దుకాణం నుంచి నెలకు ఫిక్స్‌డ్‌గా ఇంత అని వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఎలాంటి ప్రయోజనం చూపించకుండా నెలకు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పమంటే వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనలో ఇక్కడి నాయకులు పడ్డారు. మద్యం అమ్మకాల విషయంలో పట్టువిడుపుల చూపటమే కాకుండా, పరోక్షంగా బెల్టు షాపులకు సహకరిస్తే తాము అడిగినంత ఇస్తారన్న నిర్ణయానికి వచ్చారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతల కోటరీ నాయకుడు సాగిస్తున్న మద్యంలో ముడుపుల వేట ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

మద్యం పాలసీని ఉల్లంఘిస్తే చర్యలు

ప్రభుత్వం మద్యం పాలసీని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇక బెల్టు షాపుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉంది. సీఎం చంద్రబాబు కూడా బెల్టు షాపులు నిర్వహించేవారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. అలా కాదని జిల్లాలో ఎవరైనా బెల్టు షాపులకు సహకరిస్తూ మద్యం సరఫరా చేసినట్లు తెలిస్తే సంబంధిత మద్యం దుకాణాదారులకు మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా, రెండోసారి పట్టుబడితే దుకాణాన్ని మూసివేస్తాం. బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే 80088 28467 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

-రవికుమార్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి, నంద్యాల

జర్నలిస్టులను బెదిరించడం దారుణం

- పిల్లల స్కూల్ ఫీజులో 60 శాతం రాయితీ ఇవ్వాలి
- జేసీ, ఎస్పీకి జర్నలిస్టుల వినతి పత్రాలు



జేసీకి వినతి పత్రం ఇస్తున్న ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, అక్రమాలపై వార్తలు రాస్తే ఫిర్యాదులు చేసి జర్నలిస్టులను బెదిరించడం దారుణమని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ సమితి సభ్యులు జి.కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు హరికిషణ్, సురేష్, సుంకన్న, ఖలీల్, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, అవినాశ్, వెంకటేశ్ అన్నారు. జేసీ డా.బి.నవ్య, ఎస్పీ జి.బిందుమాధవ్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల పత్తికొండ పట్టణంలో పలు లాడ్జీలు, డాబాలలో పేకాటాడుతున్నట్లు జర్నలిస్టులకు సమాచారం వచ్చిందని, ఆ మేరకు రిపోర్టర్లు వార్తలు రాశారని చెప్పారు. ఈ వార్తల్లో ఓ అధికారి అండతో ఆడుతున్నారని రాశారని, అయితే తన పరువుకు భంగం కలిగిందని, ఒక్కో రిపోర్టర్‌పై రూ.50 లక్షలకు పరువు నష్టం దావా వేస్తానని బెదిరించారని చెప్పారు. పైగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. అలాగే ఆదోనిలో అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైందని, అయితే రిపోర్టర్‌పై టీడీపీ నాయకురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు నమోదు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

ఫీజులో రాయితీ ఇవ్వాలి

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు మొత్తం ఫీజులో 60 శాతం రాయితీ ఇచ్చేలా అధికారులు సర్క్యులర్ జారీ చేయాలని జర్నలిస్టులు కోరారు. దీనిపై స్పందించిన జేసీ, డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను పిలిచి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సర్క్యులర్ ఇస్తామని డీఈవో చెప్పారు. జేసీని కలిసిన వారిలో ఎమ్మిగనూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయుడు, నాయకులు రామయ్య, భాస్కర్, మురళి, రంగ, మల్లికార్జున, చాంద్, గంగాధర్, ఫొటోగ్రాఫర్ రఫీ, కెమెరామెన్లు రాజు, రఫీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల సౌకర్యార్థం కూరగాయల మార్కెట్'



పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం

మద్దికెర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలోని మెయిన్‌బజారులో ప్రజల ఇబ్బందులను గుర్తించి నాబార్డు నిధులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం చేయడం జరిగిందని జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మెయిన్‌బజారులో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమయ్యే మార్కెట్లు కూడా నాబార్డు ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మద్దికెరలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌కు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి రూ.3 లక్షలు విరాళం ఇచ్చారని, మరో రూ.15 లక్షలు నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయడంతో నవ యూత్ అసోసియేషన్ వారు నిర్మాణం చేపడుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు మాజీ ఉప సర్పంచ్ వి.నాగేశ్వరరెడ్డి, పంచాయతీ సభ్యులు రామాంజనేయులు, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడిపై భాను కిరణాలు

ఆధ్యాత్మికతతో ఓలలాడిన దుర్గా భోగేశ్వరం



దుర్గాభోగేశ్వరుడ్ని తాకుతున్న సూర్య కిరణాలు

గడివేముల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ప్రభాత భానుడి లేలేత కిరణాలు.. పచ్చని చెట్ల మధ్యలో నుంచి ఆలయ గర్భగుడిలోని దుర్గాభోగేశ్వరునిపై ప్రసరించడం ఈ దేవస్థానం ప్రత్యేకత. ఈ దృశ్యం చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ అద్భుత సంఘటన నంద్యాల జిల్లాలోని గడివేముల మండలం గడిగరేవుల గ్రామ పరిధిలో వెలసిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం ఆవిష్కృతమైంది. జనమేజయ మహారాజు కాలంలో నిర్మించిన దుర్గాభోగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏడాది కార్తీక మాసంలో దుర్గాభోగేశ్వరునిపై సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. సూర్యకిరణాలు ప్రసరించే సమయంలో పూజలు నిర్వహిస్తే పుణ్యఫలాలు దక్కుతాయని ఆలయ అర్చకులు శ్యాంసుందర్ శర్మ తెలిపారు. సోమవారం ఉదయం 6.55 గంటల నుంచి 7.05 గంటల వరకు దుర్గాభోగేశ్వరునిపై సూర్యకిరణాలు ప్రసరించాయి.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి ప్రజాధనం కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదాని లాంటి సంపన్నుల కోసం పేద మధ్యతరగతి ప్రజలు, సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలపై వేలకోట్ల భారం వేశారని సోమవారం విద్యుత్‌భవన్ ముందు ధర్నాకు దిగారు. పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాగరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి ర్యాలీ చేపట్టి ధర్నాకు దిగారు. నాయకులు మాట్లాడుతూ గత నెలలో ప్రకటించిన రూ.6 వేల కోట్లతో సహా 11,820 కోట్ల ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల ధర్నా

రాష్ట్రంలో జరిగే అవినీతి ఇతర దేశాలు చెప్పే వరకు మన పాలకులకు నిఘావర్గాలకు తెలియక పోవడం బాధాకరమన్నారు. ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి కూటమి ప్రభుత్వం మాటపై నిలబడాలని చాంబర్ ఆఫ్ కామర్స్, పెట్రోల్ బంక్ యజమానుల సంఘం, మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్, చిన్న తరహా వ్యాపారుల సంఘం, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు విద్యుత్ శాఖ టెక్నికల్ గీఈ ఓటులేసుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్, ఎం.యాకో, అన్వర్‌బాషా, ఖలీల్‌అహమ్మద్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, తిరుపతయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నా నిజాయితీపై బాబుకు నమ్మకం


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు


ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

(5వ పేజీతరువాయి

యువకుడైన టీజీ భరత్ పరిశ్రమలు తీసుకొచ్చి రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి తగిన గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కేఈ క్రిష్ణమూర్తి, ఫరూక్, తాను పార్టీ కోసం ఎన్నో కార్యక్రమాలు చేశామని, ఆ క్రమంలోనే తమకు పార్టీ గుర్తింపు ఇస్తోందని అన్నారు. పార్టీని నమ్ముకుని ప్రతి ఒక్కరూ పని చేస్తూ పోవాలని, పదవులు వాటంతటఅవే వస్తాయని తెలిపారు. జిల్లాలో కూడా 279 నాన్ లే అవుట్ వెంచర్లు ఉన్నాయని, వాటన్నిం టిని క్రమబద్ధీకరించి ప్రభుత్వాదాయం పెంచేదిశగా కార్యాచరణ రూపొందిస్తానని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలను మోసగించినవారి భరతం పడతామని హెచ్చరించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాల నాయకులు కార్యకర్తలు గజమాలలు, బొకేలు, పూల కుండీలతో సోమిశెట్టిని సన్మానించారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోట్ల సుజాతమ్మ, మీనాక్షినాయుడు, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వారసులతో కూడా కలిసి రాజకీయాలు చేస్తున్నాం- ఎన్ఎండీ ఫరూక్, మంత్రి

గతంలో టీడీపీ నాయకులు బీవీ మోహన్‌రెడ్డి, కేఈ క్రిష్ణమూర్తి, టీజీ వెంకటేశ్‌లాంటి నాయకులతో కలిసి పని చేశాం. నేడు వారి వారసులు బీవీ. జయనాగేశ్వరరెడ్డి, టీజీ భరత్, కేఈ శ్యామ్ బాబు లాంటి యువకులతో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. అప్పట్లో మేమంతా కలిసి జిల్లా కేంద్రం కర్నూలులో పార్టీ కార్యాలయాన్ని సొంతంగా నిర్మించుకున్నాం. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఊరికో కార్యాలయం కడుతోంది. రాజకీయాల్లో విలువలను చంద్రబాబు నేర్పించారు. అందుకే మరోసారి నాకు, సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు సేవ చేసే అవకాశం కల్పించారు.

మా కుటుంబంలో మరొకరికి పదవీ వచ్చినంత అనందంగా ఉంది: మంత్రి టీజీ భరత్

మా కుటుంబంలో మరొకరికి పదవి వచ్చినంత ఆనందంగా ఉంది. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనను సోమిశెట్టి ఎదిరించి, ధైర్యంగా కేసులను కూడా లెక్క చేయకుండా పార్టీ కోసం కష్టపడ్డారు. ఆయన సేవలకు గుర్తింపుగా నేడు కుడా చైర్మన్ బాధ్యతలు పార్టీ అప్పగించింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం హైకోర్టు బెంచ్ ప్రకటించింది. హామీ నెరవేర్చే క్రమంలో పార్టీ కోసం కష్ట పడ్డ వారందరికీ చంద్రబాబు పదవులు ఇస్తున్నారు. అందరికీ న్యాయం చేస్తున్నారు. దీనికి నేడు జిల్లాకు వరించిన పదవులే నిదర్శనం.

పార్టీకి వన్నె తెచ్చిన నాయకుడు సోమిశెట్టి: కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే పత్తికొండ

పార్టీకి వన్నె తెచ్చిన నాయకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు. యువతలో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులకు నిత్యం నిర్దేశం చేస్తూ పార్టీకి పెద్దదిక్కుగా సేవలందిస్తున్నారు. యువత ఆదర్శంగా తీసుకుని పార్టీ కోసం పని చేయాలి.

ఉమ్మడి జిల్లాకు ఎప్పటికీ అధ్యక్షుడే: బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే శ్రీశైలం

సోమిశెట్టి ఎప్పటికీ ఉమ్మడి జిల్లాకు అధ్యక్షుడిగానే ఉండాలని కోరుకుంటా. మరోసారి కుడా చైర్మన్‌గా ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు రాజకీయాలతో పాటు, పాలనలో కూడా భాగస్వామి కావడం గర్వంగా ఉంది.

మా నాన్న లేరన్న బాధ కనిపిస్తోంది- జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

వేదికపై నాన్నతో కలిసి పని చేసిన వారందరూ ఉన్నారు. పార్టీ కోసం శ్రమించిన తన తండ్రి బీవీ మెహన్‌రెడ్డి వేదికపై


సోమిశెట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి టీజీ భరత్

లేకపోవడం బాధగా ఉంది, చంద్రబాబు నాయకత్వంలో సీనియర్లు పార్టీకి ఎంతో సేవలు అందించారు. అందులో ప్రతి ఒక్కరం వారిని ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధి కోసం పని చేస్తాం.

చాలెంజ్‌గా తీసుకుని పని చేశారు: బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

సోమిశెట్టి వెంకటేశ్వర్లు చాలెంజ్‌గా తీసుకుని ప్రతి కార్యక్రమం నిర్వహించారు. అందుకు తగ్గట్టుగా ఫలితాలు ఆయన తీసుకుంటున్నారు. అందరూ ఆయన అడుగు జాడల్లో నడిచి పార్టీ కోసం పని చేయాలి.

పదవుల కోసం కాదు .. పార్టీ కోసం పని చేయాలి: తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పదవుల కోసం కాకుండా పార్టీ కోసం పని చేయాలి. సభ్యత్వ నమోదులో అందరూ భాగస్వాములు కావాలి. రాష్ట్రంలో ఏ జిల్లాకు రాని చైర్మన్లు, కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదవులు మన జిల్లాకు వచ్చాయి. టీటీడీ బోర్డు సభ్యుడిగా కూడా అవకాశం కల్పించారు. ప్రతి ఒక్కరు పార్టీ కోసం పని చేయండి.. పదవులు వాటంతట అవే వస్తాయి. అందుకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు నిదర్శనం.

అందరినీ గౌరవించే వ్యక్తి సోమిశెట్టి

• బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత నాగార్జునరెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అందరివారు అని, అందరినీ గౌరవిస్తారని బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జునరెడ్డి కొనియాడారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాలులో 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బత్తుల బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత బత్తుల నాగార్జున రెడ్డి హాజరై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన సోమిశెట్టిని సన్మానించారు. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సోమిశెట్టి ఎంతో కృషి, పట్టుదలతో ఉన్న పదవులు అలంక రించారన్నారు. ఆయన దగ్గరికి ఎవరు వెళ్లినా మర్యాపూర్వకంగా పలకరి స్తారని కొనియాడారు. అలాంటి గొప్పవ్యక్తి మరిన్ని పదవులు అలంకరించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


సోమిశెట్టికి జ్ఞాపికను ఇస్తున్న నాగార్జునరెడ్డి


మంత్రి టీజీ భరత్‌తో మాట్లాడుతున్న బత్తుల నాగార్జునరెడ్డి

ఐడీఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కిషోర్ కుమార్



కర్నూలు హాస్పిటల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షునిగా నంద్యాలకు చెందిన సీనియర్ దంత వైద్యులు డా.కే.కిషోర్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఐడీఏ రాయలసీమ కర్నూలు, నంద్యాల జిల్లాల దంత వైద్యుల వార్షిక సమావేశం కర్నూలులోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఐడీఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా డా.పరమేశ్వరరెడ్డి, డా.దత్తసాయి కిరణ్; డా.సతీష్, ట్రెజరర్‌గా డా.సందీప్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఐడీఏ జిల్లా సెక్రటరీ డా.రాయపురామ చంద్రరెడ్డి, మాజీ అధ్యక్షులు డా.ఉపేంద్రనాథ్ రెడ్డి, డా.లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, డా.నాగలక్ష్మిరెడ్డి, డా.నరేష్‌గౌడు, డా.నౌషాద్ పాల్గొన్నారు.

పెరుగుతున్న పత్తి ధరలు


ఆదోనిలో విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

• క్వింటాలు రూ.7,308

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు పెరుగుతున్నాయి. సోమవారం మళ్లీ పత్తి ధర స్వల్పంగా పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు పత్తి గరిష్ఠంగా రూ.7,308 పలికింది. గత వారం కంటే క్వింటాలు పత్తి ధర రూ.300పైగా ధర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్ దూది, గింజల ధరలు పెరగడం వల్ల స్థానిక మార్కెట్ యార్డులో ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు పేర్కొన్నారు. 6018 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4,599, గరిష్ఠ ధర రూ.7,308, మధ్య ధర రూ.7,149 పలికింది.

బైక్‌పై నుంచి కింద పడి మహిళ మృతి

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కింద పడి ఓ మహిళ మృతి చెందింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. మండంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెంకు చెందిన రామాంజనేయులు-శివలక్ష్మి దంపతులు దిగువ అహోబిళంలోని రాణప్రాసన్న ఆశ్రమం కాపలాదారులుగా ఉంటున్నారు. కార్తీక సోమవారం కావడంతో బండిఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రానికి కోడలు మాసమ్మతో కలిసి బైక్‌పై బయలుదేరారు. నరసాపురం గ్రామ సమీపంలోని కుంట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో శివలక్ష్మి 36) బైక్‌పై నుంచి రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై ఎగిరి పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొని కోడలు మాసమ్మ, రామాంజనేయులు గాయపడ్డారు. అలాగే మరో బైక్‌పై ఉన్న ముకుందాపురానికి చెందిన సుందర్‌రావు, శ్వేత అనే మరో ఇద్దరు కూడా గాయపడ్డారు. వీరిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

రహదారిపై వరి ధాన్యం ఆరబోయడం వల్లే..

రహదారిపై వరి ధాన్యం ఆరబోశారు. రెండు వరుసల రహదారిలో ఒక వరుసలో వరి ధాన్యం ఆరబోశారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాల్సిన పరిస్థితి. ఇదే తరుణంలో ఆళ్లగడ్డ నుంచి అహోబిళం వెళుతున్న కారును తప్పించబోగా ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అటు అధికారులు చర్యలు తీసుకుని రహదారిపై ధాన్యం ఆరబోతను అరికట్టాల్సిన అవసరం ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

• దంపతులను కబళించిన ప్రమాదం


చంద్రశేఖర్, ఈశ్వరమ్మ (ఫైల్)

శిరివెళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఈశ్వరమ్మ (60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య సోమవారం తెలిపారు. అరుణాచలం నుంచి కర్నూలుకు వెళ్తున్న కారును శిరివెళ్లకు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఢీకొట్టడంంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన ఈశ్వరమ్మ, రవి కుమార్‌లను చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. వీరిలో ఈశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆమె కోలుకోలేక మృతి చెందారు. కర్నూలులోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఎస్ఐ చంద్రశేఖర్ ఘటన రోజే మృతి చెందగా ఆయన భార్య ఈశ్వరమ్మ సోమవారం ఉదయం మృతి చెందారు. భార్యాభర్తలిద్దరూ గంటల వ్యవధిలో మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంతో నిండిపోయింది. మృతుల కుమారుడు రవి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ సోదాలో ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష పడింది. సోమవారం పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఉప్పరపేటకు చెందిన కందమురి శివకుమార్, బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన కె. రంగస్వామి అనే వ్యక్తులను అరెస్టు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్. రామభూపాల్‌రెడ్డి ఎదుట హాజరుపరచినట్లు నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపారు. వారికి రెండురోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

నల్లమల్ల పల్లెలకు విద్యుత్ వెలుగులు

• క్షేత్ర స్థాయి సందర్శన చేసిన జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది ఒడ్డున ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలోని నీటి ముంపు గ్రామాల ప్రజలకు త్వరలో విద్యుత్ వెలుగులు రానున్నాయి. నాలుగున్నర దశాబ్దాల కాలంగా చిమ్మ చీకటిలో మగ్గుతున్న కొత్తపల్లి మండలంలోని సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం వాసులకు మహర్దశ రానుంది. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్, ఆత్మకూరు ఏడీ రామసుబ్రహ్మణ్యం, డీఈ జయశంకర్, ఏఈ అబ్దుల్ హబీద్‌లు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుధాకర్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు రూ.96 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. సంగమేశ్వరం నుంచి జానాలగూడెం వరకు సుమారు 7 కి.మీల మేర 278 విద్యుత్ పోల్స్ అవసరం ఉన్నట్లు చెప్పారు. అలాగే 11 కేవీ లైన్‌తోపాటు నాలుగు సింగిల్ ఫేజ్ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటి భూమి పూజ కోసం నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు మంగళవారం హాజరు కానున్నారని తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో 3, 6వ రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి జనవరి 7 వరకు కొనసాగే పరీక్షలను రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడుతో కలిసి పరిశీలించారు.

3వ సెమిస్టర్ పరీక్షల్లో 224కు 223, సప్లిమెంటరీలో 74కు 74, 6వ సెమిస్టర్ పరీక్షలకు గాను 167కు 167 మంది సప్లిమెంటరీ పరీక్షలకు 3 దరఖాస్తు చేసుకోగా ముగ్గురు హాజరయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం


గంజాయి మొక్కలను కాల్చేస్తున్న కౌతాళం సీఐ అశోక్ కుమార్

కౌతాళం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడూరు గ్రామంలో 183 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని ముగ్గురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, ఎక్సైజ్ అధికారులతో కలిసి రౌడూరు గ్రామంలోని సర్వే. నెం 391లో గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్య, రఘువర్ధన్ రెడ్డి, మాల వీరేష్ సాగు చేస్తున్న పొలం నుంచి 183 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని 182 మొక్కలను పంచాయితీదారుల సమక్షంలో పొలంలో కాల్చేశామని ఒక గంజాయి మొక్కను శాంపుల్ నిమిత్తం స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

• అంకిరెడ్డిపల్లెలో విషాదం

కొలిమిగుండ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విచిత్రంగా హెయిర్ కటింగ్ చేయించుకున్నాడని పెంపుడు తల్లిదండ్రులు మందలిం చారని విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన వడ్డె పెద్దిరాజు, షేక్‌మాబీ దంపతులు తాడిపత్రికి చెందిన మాబీ సోదరి కుమారుడు దూదేకుల సిద్ధిబాషాను(12) చిన్నప్పటి నుండి పెంచుకుంటున్నారు. సిద్ధిబాషా తాడిపత్రిలోని శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రతి రోజు అంకిరెడ్డిపల్లె నుంచి బస్సులో పాఠశాలకు వెళ్లి వచ్చే సిద్ధిబాషా సోమవారం సెలూన్ షాపుకు వెళ్లి విచిత్రమైన పద్ధతిలో కటింగ్ చేయించుకున్నాడు. పాఠశాలకు వెళ్లడానికి ఇది బాగుండదని, తిరిగి మామూలు పద్ధతిలో కటింగ్ చేయించుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో బాషా ఆవేశంతో ఇంటి పైన ఉన్న రూములోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకు న్నాడు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

● రూ.2.15 లక్షల నగదు స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

ఆదోని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మట్కా నిర్వహిస్తున్న బీటర్లను సోమవారం మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సోమన్న వివరాల మేరకు... కమ్మరచేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి బళ్లారిలో నివాసం ఉంటూ పటణంలోని హవన్న పేటకు చెందిన షేక్ చకోలి చాంద్ బాషాతో కలిసి మట్కా నిర్వహిస్తున్నారన్నారు. పోలీసులు పట్టణ శివారు ప్రాంతమైన ఆస్పరి రహదారిలోని ఎంజీ బ్రదర్స్ వెంచర్‌లో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.2,15,600 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వీరితోపాటు ముస్సి ఆలీ హుస్సేన్, ఈరప్పల నుంచి 15 లీటర్ల నాటు సారా, రూ.35,500 నగదును సీజ్ చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు. వారిని రిమాండ్ తరలించామన్నారు.

కారు, బైకు ఢీ

• ముగ్గురికి గాయాలు

మహానంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం శ్రీనగరం- అల్లీనగరం గ్రామాల మధ్య సోమవారం కారు- మోటర్ బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మహానంది ఆలయానికి కార్తీక మాసం పురస్కరించుకొని దర్శనాకి వచ్చి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్న నంద్యాల మండలం సాంబవరం గ్రామానికి చెందిన నాగచంద్రుడు, నాగమోహన్, సురేంద్ర అనే ముగ్గురు యువకుల బైక్‌ను అల్లీనగరం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు టైరు పగిలి కొట్టింది. బైక్ మీద వస్తున్న ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. క్షతగా త్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నిర్మాణాలు వేగవంతం చేయండి

పాములపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ నాగరాజు అన్నారు. సోమవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్వర్యంలో హౌసింగ్‌పై అధికారులతో డీఈఈ రివ్యూ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2025 మార్చి నాటికి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేల చూడాలని ఆదేశించారు. పలు అంశాలపై చర్చించి సలహాలు సూచనలు తెలియ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పల్లె పండుగ నిధులతో గ్రామాభివృద్ధి

ఆత్మకూరురూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ నిధులతో గ్రామాలు పురోభివృద్ధి చెందుతున్నాయని ఆత్మకూరు మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం కరివేన గ్రామంలో 2.2 కోట్ల పల్లె పండుగ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామాలబివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతిరాజ్ ఏఈ సుబ్బయ్య, టీడీపీ నాయకులు కాగుల శేషన్న, సోంపల్లి వెంకట్రావు, బాలుడులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల సౌత్ జోన్ పోటీలకు ఆర్‌యూ జట్టు


క్రీడాకారిణులతో రామకృష్ణారెడ్డి

నంద్యాల, నవంబరు 25 : (ఆంధ్ర జ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల షటిల్ బాడ్మింటన్ మహిళల సౌత్‌జోన్ పోటీలకు ఆర్‌యూ జట్టు సోమవారం బయల్దేరింది. నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల కాశిరెడ్డినాయన ఇండోర్ స్టేడియంలో ఆర్‌యూ జట్టుకు చెందిన రామకృష్ణ కళాశాల జట్టు క్రీడాకారిణుల శిక్షణా శిబిరం పూర్తి చేసుకుంది. క్రీడాకారులకు డా.రామకృష్ణారెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ నెల 26నుంచి 28వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో జరిగే అంతర్‌విశ్వవిద్యాలయాల సౌత్‌జోన్ మహిళల జట్టు ప్రాతినిథ్యం వహించనున్నట్లు మేనేజర్ హేమంత్‌రెడ్డి తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారిణులతోఉన్న ఆర్‌యూ జట్టు తప్పనిసరిగా చాంపియన్‌గా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రగతిరెడ్డి, జట్టు మేనేజర్, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన బ్రహ్మానందరెడ్డి


మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

నంద్యాల, నవంబరు 25 : (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను నంద్యాల టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కలిశారు. సోమవారం ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలను లోకేశ్ అడిగి తెలుసుకున్నట్లు భూమా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నంద్యాల నియోజకవర్గంతోపాటు జిల్లా అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉన్నట్లు లోకేశ్ తెలిపారని ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నంద్యాల క్రీడాకారులు


పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్వ్కై మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీలకు నంద్యాలకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ బాష సోమవారం తెలిపారు. 24ఆదివారం విజయవాడలో 7వ రాష్ట్ర స్థాయి స్వ్కై కరాటే పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో 10బంగారు, 12వెండి, 8కాంస్య పతకాలను సాధించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన పది మంది నంద్యాలకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, హర్యాణాలో డిసెంబరు 7, 8 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సత్తా చాటిన విద్యార్థులు

వెలుగోడు నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెలుగోడులోని లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటేలో సత్తా చాటారు. ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొన్నారు. 80 కేజీల విభాగంలో జస్వంతరెడ్డి మొదటి స్థానంలో, 65 కేజీల విభాగంలో ఇర్ఫాన్ ద్వితీయ స్థానంలో, 50 కేజీల విభాగంలో విలియం కేరి తృతీయ స్థానంలో 45 కేజీల విభాగంలో తేజస్‌గౌడ్ తృతీయ స్థానంలో విజయం సాధించారు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు.

ఆలయానికి ఇచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయండి

మిడుతూరు, నవంబరు 25:(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీరుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన సోమసుందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తమ పూర్వీకులు ఆలయానికి ఇచ్చిన భూమిని దేవుళ్ల పేరు మీద ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులును సోమవారం కోరారు. రెడ్డివారి సోమసుందర్ రెడ్డి తహసీల్దార్‌తో మాట్లాడుతూ మా పూర్వీకులు రెడ్డివారి స్వామి రెడ్డి కుమారులు రెడ్డివారి వీర రెడ్డి, శివరామి రెడ్డి రాములవారికి, ఈశ్వరస్వామి, చిన్నికృష్ణుడు ఆలయాలకు గ్రామంలోని సర్వేనెంబరు 1050లో 8 ఎకరాల పొలాన్ని రిజిస్ట్రేషన్ చేశారని, ఆలయం జీర్ణోద్ధరణ కానందున ప్రస్తుతం వారి వారసుల పేరు మీద ఆన్‌లైన్ ఉందని తహసీల్దార్‌కు తెలియజేశారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఏపీపీ బాబా రాజేంద్రప్రసాద్

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై ఆయా శాఖల అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఏపీపీ బాబా రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పరిధిలోని భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) చట్టంలోని సెక్షన్, 47, ఆర్టికల్ 22 క్లాస్-1కు సంబంధించి వివరాలను పోలీసు, ఎక్సైజ్, అటవీ అధికారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అరెస్టు కాబడిన వ్యక్తికి ఉండాల్సిన హక్కులు, అరెస్టును తెలియపరిచే విధానం గురించి వివరించారు.


పాములపాడు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఓంకారంలో భక్తుల రద్దీ


దుర్గాభోగేశ్వరంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శోభిల్లిన శివాలయాలు


ఓంకారంలో..

చివరి సోమవారం ప్రత్యేక పూజలు చేసిన భక్తులు


ఓంకారంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆత్మకూరు నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు వేకువజామునే ఆలయాలు, ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. వేలాది మంది భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆత్మకూరులోని సిద్దేశ్వరాలయం, ఉమామహేశ్వరాలయం, ఆత్మలింగేశ్వరాలయం, మార్కండేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో శివలింగాలను అభిషేకించడంతో పాటు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయం కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో స్నానమాచరించి దుర్గాభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపల్లి: సప్తనధుల సంగమేశ్వరం భక్త జనసంద్రమైంది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎగువన ఉన్న లలిత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కృష్ణాతీరంలో కార్తీకదీపాలు వెలిగించారు. పురోహితులు ఉత్సవమూర్తులకు ముత్యాల తలంబ్రాలు, అక్షతారోపణం, వేద మంత్రోచ్ఛరణాల మధ్య విశేష పూజాదిక్రతువులు నిర్వహించారు. అలాగే సంగమేశ్వరం దర్శించుకున్న భక్తులు కొలనుభారతి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నంద్యాల కల్చరల్: నంద్యాలలో కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులతో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. నంద్యాల ప్రథమనందీశ్వరాలయంలో భక్తులు పెద్దఎత్తున వచ్చి ప్రథమనందీశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు.

బండిఆత్మకూరు: భక్తుల ఓంకారనాద స్మరణతో ఓంకార క్షేత్రం హోరెత్తింది. పవిత్ర కార్తీక మాసం నాల్గవ సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈవో నాగప్రసాద్ నేతృత్వంలో అర్చకులు గంగా ఉమా సమేత సిద్ధేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సమీపంలో ఎత్తైన కొండలపై వెలసి ఉన్న పద్మావతి సహిత శ్రీనివాసున్ని కాలినడకన వెళ్లి భక్తులు దర్శించుకున్నారు.

ఆత్మకూరు రూరల్: కార్తీక మాస చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు.ఈ ఆలయంలో వెలసిన రుద్రాణి సహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు గావించారు. రాత్రి మహిళల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. నంద్యాలకు చెందిన సురేష్ గురూజి ఆధ్వర్యంలో పలువురు విద్యార్థినుల బృందం క్షేత్ర ప్రాంగణంలో కూచిపూడి, భరత నాట్యం నిర్వహించారు.

పాములపాడు: కార్తీకమాసం చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. సోమవారం పాములపాడులోని బ్రహ్మంగారి ఆశ్రమం వద్ద శివాలయంలో మహా శివునికి మహిళలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.


సంగమేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రథమ నందీశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు


నంద్యాలలో..


ఆత్మకూరులోని సిద్ధేశ్వరాలయంలో..


కొత్తపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే


వినతి పత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరురూరల్ నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : అధికారులు క్షేత్ర స్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు సూచించారు. సోమవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యలయం ఎదుట ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే జయసూర్య హాజరయ్యారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల గురించి వీఆర్వోలు, గ్రామంలోని సమస్యలను పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ ఏఈలు, లైన్‌మెన్‌లు, సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మనది మంచి ప్రభుత్వం అని ప్రజలు మెచ్చుకొనేలా పనులు చేయాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. పట్టణంలోని మనారిటీ కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదని, అక్కడ మూడు విద్యుత్ స్తంభాలు అవసరమని పట్టణ మహిళలు అడగగా వెంటనే విద్యుత్ శాఖా ఏఈ రాములునాయక్‌ని పిలిపించి స్తంభాలను ఏర్పాటు చేసేవిదంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని సోషల్ వర్కర్ అచ్చన్న వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక..

కొత్తపల్లె మండలం గువ్వలకుంట్ల గ్రామానికి మజరా గ్రామమైన బండిణాయని పాలెం వైసీపీ నాయకులు బోయ రమణయ్య, బోయ చంద్రుడు, బోయ వెంకటేశ్వర్లు, బోయ పెద్ద రమణయ్యలతో పాటుగా 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే జయసూర్య టీడీపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండల మాజీ ఉపాధ్యక్ష్యులు పోతా సహదేవుడు, బోయ వెంకటరమణల ఆధ్వర్యంలో చేరారు.

ఆక్రమణలపై చర్యలు


ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలిస్తున్న సర్వేయర్

పాణ్యం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని పాణ్యం పంచాయతీ పరిధిలో ఆక్రమణలకు గురైన స్థలాలపై చర్యలు చేపడతామని తహసీల్దారు నరేంద్రనాథ రెడ్డి తెలిపారు. ఈనెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన రిజిస్ట్రేషన్‌లలో దళారులు అన్న వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం సుగాలిమెట్టలో ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించారు. 1919, 1020 సర్వే నెంబర్లలోని స్థలాలను మండల సర్వేయరు నాగరాజు, దినేష్ పరిశీలించారు. ఈ భూములు ఏఆర్ ల్యాండ్ అని ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. అలాగే సుగాలిమెట్టలోని ఇంటిని తప్పుడు సర్వే నెంబరువేసి ఆళ్లగడ్డలో రిజిస్ట్రేషన్ చేయడం అక్రమమని పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ చెల్లదన్నారు. ఏఆర్ ల్యాండ్‌లో భూముల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదన్నారు.


పంట బీమాతో రైతులకు రక్ష

వెలుగోడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాతో రైతులకు రక్షణ అని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ అన్నారు సోమవారం మండంలోని గుంతకందాల గ్రామంలోని వరిపంటలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకురబీలో రైతులు సాగుచేసిన పంటలక ప్రదానమంత్రి పసల్ బీమా యోజన పథకం కింద పంటబీమా చేసుకోవాలని తెలిపారు. దీంతో పంట నష్టం జరిగినప్పుడు రైతులకు బీమా రక్షణగా ఉంటుందని తెలిపారు మండలంలో వరికోతలు మొదలు అయ్యాయని వరి ఎకరాకు 30 నుండి 40 బస్తాల దిగుబడి వస్తున్నాయని, ఈ ఏడాది దిగుబడులు ఆశా జనకంగా ఉన్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఎఈవో అంజిత్‌కుమార్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

గడివేముల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. కుందూనదికి నీళ్ల రాకపోవడంతో నది పరివాహక ప్రాంతంలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము పంటలు ఎండుముఖం పట్టాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావడంతో ఆమె కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్‌తో చర్చించారు. కేసీకెనాల్ నీటిని అలగనూరు రిజర్వాయర్ ద్వార కుందూనదికి విడుదల చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో 200 క్యూసెక్కుల నీటిని అలగనూరు రిజర్వాయర్ ద్వార కుందూనదికి విడుదల చేశారు. కుందూనదిలో నీరు ప్రవహిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐకమత్యమే మహాబలం


మాట్లాడుతున్న కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివన్న

గడివేముల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా ఉంటేనే అన్ని విధాలా అభివృద్ధి చెందుతామని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గుడిసె శివన్న, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, ఉపాధ్యక్షుడు కత్తి రంగస్వామి అన్నారు. మండలంలోని బిలకలగూడూరు గ్రామంలో సోమవారం జరిగిన కురువ సంఘం వనభోజన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు, పుల్లయ్య, అల్లెబాబు, రామస్వామి, యుగంధర్ పాల్గొన్నారు.

మైనార్టీల ద్రోహి జగన్

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

నంద్యాల కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి మైనార్టీ ద్రోహిగా జగన్మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర మైనార్టీఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల నడిగడ్డ, నందమూరినగర్ కాలనీలో వార్డు ప్రజలతో సమావేశమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం మైనార్టీలకు వివిధ వర్గాల ప్రజలకు అనేక ఆశలు చూపి మోసం చేసిందని, రంజాన్ తోఫా, విదేశీవిద్య, హజ్‌యాత్ర తదితర అంశాలను విస్మరించిందన్నారు. కొన్ని పథకాలను పూర్తిగా రద్దుచేసి ద్రోహం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించి పథకాలను పునఃప్రారంభించిందని పేర్కొన్నారు. తనను మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేసిన ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖజా ఫరీద్, అబ్దుల్ రషీద్, టీడీపీ సీనియర్ నాయకులు ఖాజా హాఫీజ్, టీడీపీ పార్టీ మైనార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి


తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాణ్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలో అరవై ఏళ్లుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జునైద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటికి ప్రహరీ, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తహసీల్దారు నరేంద్రనాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ చర్యలు చేపట్టకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యాసంస్థలు ఒకే స్థలంలో ఉండి విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, అరుణ్ కుమార్, వెంకటాద్రి, పెరుగు శివకృష్ణ యాదవ్, రాజు, వేణు, శ్రీరాం, రాజేష్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడి అంచనా

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంట కోత ప్ర యోగంతోనే దిగుబడి అంచనా వేయొచ్చని జిల్లా వ్యవసాయాధి కారి మురళీ క్రిష్ణ అన్నారు. సోమవారం మండలంలోని చందలూరు రెవెన్యూ పరిధిలో 343 సర్వే నెంబరులో 5 ఇంటు 5 మీటర్ల వ్యాసార్థంలో వరి పంటలో పంట కోత ప్రయోగం చేశారు. 17.700 కేజీలు దిగుబడి వచ్చిందన్నారు. ఈ దిగుబడి ఎకరాకు 34 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చిందని అంచనా వేశారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏ మహేశ్వరి, బీమా కంపెనీ ప్రతినిధి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల నుంచి ఈ నెల 17న దాదాపు పది మంది వ్యక్తులు కాశీ యాత్రకు వెళ్లారు. కాశీలో దర్శనం చేసుకుని వారణాసి నుంచి ఢిల్లీకి వస్తున్న యాత్రికుల బస్సు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కౌశాంబి జిల్లా కేంద్రంలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బత్తులూరుకు చెందిన ఓ యాత్రికుడు మృతి చెందగా, రుద్రవరం మండలానికి చెందిన ఆర్య వైశ్య కుటుంబసభ్యులు గాయపడ్డారు. రహదారి ప్రమాదంలో వారు బ్యాగులు, డబ్బులు కోల్పోవడంతో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తక్షణం స్పందించి బాధితులకు అండగా నిలిచారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి క్షతగాత్రులకు అక్కడ వైద్య సేవలు అందించారు. అలాగే బాధితులు క్షేమంగా ఇంటికి వచ్చేందుకు వాహనాన్ని సైతం ఏర్పాటు చేయించారు. ఆపద సమయంలో సహాయ సహకారాలు అందించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ఆర్యవైశ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసి మంత్రి బీసీ



పవన్‌కళ్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రులు

బనగానపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం కలిసి పుష్ప గుచ్ఛాన్ని ఇచ్చారు. మంగళగిరిలోని పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయంలో సహచర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్‌తో కలిసి బీసీ పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికపై జరిగిన చర్చల్లో మంత్రి బీసీ పాల్గొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంత్రులతో చర్చించారు.

ఆసుపత్రిలో రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి)లో మాచిరాజు నాగ మనేంద్రరాజు సహకారంతో గర్భిణులకు , చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మానవసేవయే మాధవసేవగా లయన్స్ క్లబ్ సభ్యులు ప్రతి సోమవారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నూరా మధు సుధాకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, వలీబాషా, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నేల బిలం మల్లేశ్వరస్వామి తిరుణాల



మల్లేశ్వర స్వామి



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొలిమిగుండ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందార్లపల్లె సమీపంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేల బిలం మల్లేశ్వరస్వామి తిరుణాల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తజన సందోహం మధ్య శివ పార్వతుల కల్యాణ మహోత్సవం, పల్లకీ ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. నీటి బిలం సందర్శన కోసం భక్తులు పోటీ పడ్డారు. టీడీపీ మండల అధ్యక్షులు మూలే రామేశ్వర రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి తదితరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోవస్తు నిర్వహించారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి



ఐవీ పక్కీరరెడ్డిని సన్మానిస్తున్న అరుణ్ కుమార్‌నాయక్

అవుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన అరుణ్‌కుమార్‌నాయక్ గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి అన్నారు. సోమవారం అరుణ్‌కుమార్‌నాయక్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రామాపురం గ్రామానికి వెళ్లి ఐవీ పక్కీరరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఐవీ పక్కీరరెడ్డి మాట్లాడుతూ టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీసెల్ రాష్ట ప్రధాన కార్యదర్శి వెంకట రమణనాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరటి తోటకు అంగన్‌వాడీ చిన్నారులు



అరటి పండ్ల గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

డోన్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-1 చెందిన చిన్నారులను కాలి నడకన గ్రామ సమీపంలోని అరటితోటను సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త జులైఖ చిన్నారులను అరటితోటకు తీసుకెళ్లి అరటి యొక్క ప్రయోజనాలను, ప్రాముఖ్యతను చిన్నారులకు తెలియజేశారు. పండ్ల తోటలపై చిన్నారులకు అవగాహన కల్పించారు.



మచ్చట్లలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కొలిమిగుండ్లలో..



యాగంటిలో..

సర్వం శివమయం

- వైభవంగా కార్తీక కడ సోమవారం పూజలు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- దీపాలు వెలిగించిన భక్తులు

బేతంచెర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి సమేత భ్రమరాంబ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మం డలంలోని ఎంబాయి గ్రామ శివారులో వెలసిన భోగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన కాశీవిశ్వనాథ స్వామికి, సిద్దేశ్వరస్వామికి, పూదోట మఠంలోని బేతేశ్వర స్వామికి కార్తీక మాస ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించారు. ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆల యంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అ న్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కమ్మ సంఘం నాయకులు పోలూరు శ్రీనివాస రెడ్డి, పోలూరు రాఘవరావు, ఎండూరి శ్రీరాములు, ఎండూరి మహేష్, మురళి, భక్తులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని పాతబుగ్గరా మలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస మహో త్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త బైసా ని రాజు దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిం చారు. భక్తులకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నదానం చేశారు.

కొలిమిగుండ్ల: మండలంలోని బెలుం గ్రామంలో సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన విభూది అభిషేకం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ తెలిపారు. మహిళలు దీపాలు వెలిగించారు.

అవుకు : పట్టణంలో వెలసిన కాశీవిశ్వనాథస్వామి, చెర్లోపల్లె సమీపంలో వెలసిన బుగ్గమల్లేశ్వరస్వామి, శివవరంలోని శివాలయం ఆలయాల్లో స్వాముల వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శివాలయాల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

రుద్రవరం: కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. భాస్కర నందీశ్వరాలయం, చెన్నకేశ వాలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రవరంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



అవుకులో శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



విభూది అలంకరణలో బెలుం సిద్ధ రామేశ్వరస్వామి



ఆళ్లగడ్డలో అన్నదానం చేస్తున్న భార్గవ్‌రామ్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి (కాశింతల) క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణంలోని శివాల యంలో కార్తీక సోమవారం సందర్భంగా టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర, భైరవీశ్వర, మల్లేశ్వర ఆలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజ లు, అభిషేకాలు చేశా రు. పాత శివాల యంలో మహిళలు సామూహికంగా ఒడి బియ్యం, విష్ణు సహస్రపారాయణం చేశారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం చేశారు. గ్రామదేవత చాగలమ్మ ఆలయం వ ద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భీమలింగేశ్వర ఆలయంలో .. చాగలమర్రి గ్రామంలోని భీమలింగేశ్వర ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా సోమవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం అత్యంత కమణీయంగా సాగింది. పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో దంపతులచే కల్యాణోత్సవం చేశారు. ఆలయంలో శివపార్వతుల పల్లకి ఉత్సవం వైభవంగా చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధర్మకర్త శివనాగప్ప, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల కేంద్రంలోని ఈశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాల్లో పాటు మండలంలోని కాకనవరం, పంచ లింగాల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయం, సాయిబాబాదేవాలయం, శివాలయాలల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గుళ్లదుర్తి, పొట్టిపాడు, భీమునిపాడు, కంపమల్ల, కలుగొట్ల, రేవనూరు, వల్లంపాడు, లింగాల, చిన్నకొప్పెర్ల, సౌదరిదిన్నె. వెలగటూరు, బిజినవేముల, అమడాలతో పాటు వివిధ గ్రామాల్లో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక కడ సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి తులసీమాతకు పూజలు చేశారు.

ఉయ్యాలవాడ: కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా మండలంలోని మాయలూరు, రూపనగుడి గ్రామాల్లో వనభోజనాలు ఏర్పాటు చేశారు. నయనాలప్ప క్షేత్రానికి వెళ్లే భక్తులకు అన్నదానం చేశారు. రూపనగుడి గ్రామంలో సంపతి లక్ష్మీకాంత్, దాసరి రామసుబ్బారెడ్డిలు భోజనాలు ఏర్పాటు చేశారు.



కాశింతలలో ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హరహర నామస్మరణతో హోరెత్తిన యాగంటి

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో వెలసిన అత్యంత పురాతన శైవక్షేత్రం యాగంటి క్షేత్రం కార్తీక కడ సోమవారం సందర్భంగా వేలాది భక్త జనంతో పోటెత్తింది. భక్తుల శివనామస్మరణతో యాగంటి క్షేత్రం మార్మోగింది. ఉమామహేశ్వరస్వామి వార్లకు అభిషేకం, మహారుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఉమామహేశ్వర నిత్యాన్నదాన సత్రంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దొనపాటి యాగంటిరెడ్డి, దస్తగిరిరెడ్డి, రామారెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. అలాగే ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, వీర శైవ లింగాయతుల బసవేశ్వర అన్నదాన సంస్థల్లో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి యాగంటిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



ప్యాపిలిలో..



యాగంటిలో క్యూలైన్‌లో భక్తులు



చాగలమర్రిలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు



చిన్నవంగలిలో గృహ మద్దిలేటిస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ పరిధిలోని కాశింతల క్షేత్రంలో భక్తుల రద్దీ



మాయలూరులో భోజనాలు వడ్డిస్తున్న గ్రామస్థులు

ఆరోగ్య ఆంధ్రే లక్ష్యం

డోన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌యే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల బాధితులకు మొత్తం రూ.25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి విజయభట్టు, మాజీ జడ్పీటీసీ బుగ్గన ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

డోన్ మున్సిపాలిటీలో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా రామలింగయ్య ఎంపిక కావడంపై మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేకు న్యాయవాదులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎస్‌టీ హరూన్, భాస్కర్ నాయుడు, కాశీంసాహేబ్, శివరామకృష్ణ, నారాయణ, జబీవుల్లా, రవి మోహన్, తదితరులు ఉన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

డోన్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ స్టేషన్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. సోమవారం బేతంచెర్ల మండలం గూటుపల్లె గ్రామంలో దాడులు నిర్వహించి నాటుసారా విక్రయిస్తున్న బాలరాజు అను వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అతడి వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా బెల్లపు ఊట ధ్వంసం

అవుకు : మండలంలోని కొండమనాయునిపల్లె, పిక్కెళ్లపల్లెతండా గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా బట్టీలపై దాడులు జరిపి 5700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు బనగానపల్లె ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనదేవి సోమవారం తెలిపారు. 40 లీటర్ల నాటుసారాతో పాటు, సారా తయారీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి, ఈఎస్‌టీఎఫ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణదాసు, ఎస్ఐలు కమలాకర్, రమేష్‌బాబు, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయండి



క్రిష్టిపాడులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్

దొర్నిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం, క్రిష్టిపాడు గ్రామాల్లో ఇంకుడు గుంతలను త్వరగా నిర్మించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్ అన్నారు. సోమవారం ఇంకుడు గుంతలు నిర్మించుకునే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలను త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. ఇంకుడు గుంత ని ర్మాణానికి రూ.16 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయన వెంట ఇంజనీర్ అసిస్టెంట్ ఉజ్వా, మండల కో-ఆర్డినేటర్ జర్మియా, క్రిష్టిపాడు సర్పంచ్ శివరామిరెడ్డి ఉన్నారు.

ముగిసిన నైనాలప్ప తిరుణాల

- హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

సంజామల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒక్కటైనా నైనాలప్ప క్షేత్రంలో ప్రారంభమైన తిరునాల సోమవారం ముగిసింది. అక్కంపల్లె కొండల్లో కొలువైన ఓంకారేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. స్వామి వారి కల్యాణం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారికి కాయా కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ రమణయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలను టీడీపీ నాయకుడు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి ప్రారంభించారు. పోటీలకు 18 జతల ఎద్దులు పాల్గొనగా నంద్యాల జిల్లా గోర్లగుట్టకు చెందిన ఇంద్రసేనా రెడ్డి ఎద్దులు మొదటి విజేతగా నిలిచాయి. రెండవస్థానంలో నంద్యాల జిల్లా పందిర్లపల్లెకు చెందిన కమలబాష ఎద్దులు, తృతీయస్థానంలో కర్నూలు జిల్లా పి. రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడ్ ఎద్దులు నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతి రూ. 60,000, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి అం దజేశారు. రూ.50,000, రూ. 40,000 నగదు ప్రోత్సాహక బహుమతులను కమిటీ వారు అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు, ఆలమూరు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. పేరూరు గ్రామంలో ఈనెల 26, 27, ఆలమూరు గ్రామంలో 28, 29 తేదీల్లో ఆధార్ క్యాంపు ఉంటుందన్నారు. తప్పొప్పులను సరిచేసుకోవాలని సూచించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా సచివాలయాల్లో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26, 27 తేదీల్లో కొండుపల్లె, హరివరం సచివాలయాల్లో, 28, 29 తేదీల్లో ఉయ్యాలవాడ, మాయలూరు సచివాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించకోవాలని ఆయన సూచించారు.

హెల్మెట్ ధరించాలి

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహ నదారులు హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవ్ చేసేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని ఆటోయాత్రికుడు అబ్దుల్ గఫార్ కోరారు. సోమవారం మండలంలోని నరసాపురం గ్రామంలో ఆటోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణంలో దేవుడి ప్రార్థన మరవద్దన్నారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడుపాలని సూచించారు.

రైతులు పంట నష్టాన్ని నివారించుకోవాలి

బనగానపల్లె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాబోయే రెండు రోజుల్లో భారీ తుఫాన్ రానున్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను సంరక్షించుకొని నష్టాన్ని నివారించుకోవాలని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను కోయరాదని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను సంరక్షించుకోవాలనికోరారు.

అహోబిలంలో హుండీ లెక్కింపు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎగువ అహోబిలంలోని నరసింహా స్వామి ఆలయంలో హుండీని మఠం అధికారులు సోమవారం లెక్కించారు. ఆలయానికి రూ.49,83,346 ఆదాయం వచ్చినట్లు మఠం సీఏవో రామ్మోహన్ వెల్లడించారు. హుండీ లెక్కింపును మఠం అధికారులు, నిర్వాహకులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో చేపట్టారు.

ధ్వజస్తంభానికి బంగారు పూత

రుద్రవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో భాస్కర నందీశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగుపై బంగారు పూత వేయించినట్లు టీడీపీ మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులు సోమవారం రాత్రి తెలిపారు. మహిళలు దీపాలు వెలిగించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పేర్ల క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.